క్లుప్తంగా

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

తహసీల్దార్ జియావుల్‌హక్



పొన్నూరు: ప్రజల నుంచి వివిధ సమస్యలపై తీసుకునే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 10 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవెన్యూ 6, సర్వే 2, డీఆర్‌డీఏకు సంబంధించి 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఎంఏఓ ఆర్.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ మల్లికార్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎటువంటి కోచింగ్ లేకుండా డీఎస్సీలో 8వ ర్యాంకు



జి.నీలిమ


చేబ్రోలు: మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన జి.నీలిమ డీఎస్సీలో 8వ స్థానంలో నిలవటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన నీలిమ, ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. అనంతరం ఇదే ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు గొడుగునూరి వెంకటేశ్వరరావుతో వివాహం జరిగింది. భర్త ప్రోత్సాహంతో దూరవిద్యా విధానంలో డిగ్రీ పూర్తి చేసిన నీలిమ తరువాత బీఈడీ పూర్తి చేశారు. ఎటువంటి కోచింగ్ లేకుండానే ఇంటి దగ్గర సొంత ప్రిపరేషన్‌తోనే భర్త వెంకటేశ్వరరావు గైడెన్స్‌లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ క్యాటగిరిలో 81.50279 మార్కులతో జిల్లాస్థాయిలో 8వ స్థానంలో నిలిచారు. టెట్ పరీక్షలలో 122.43 మార్కులు సాధించారు. భర్త స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు, ఇరువురు కుమారులు పది, ఏడో తరగతి చదువుతున్నారు. ప్రతిభ కనబరిచి డీఎస్సీలో 8వ ర్యాంక్ సాధించిన నీలిమను పలువురు అభినందించారు.

విజ్ఞాన్ నిరులలో యురేకా పిచింగ్ కాంపిటీషన్



గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఐఐటీ ముంబై ఆధ్వర్యంలో యురేకా పిచింగ్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక మాట్లాడుతూ ఐఐటీ ముంబై ఆధ్వర్యంలో యురేకా-పిచింగ్ కాంపిటీషన్ తొలి విడత నిర్వహించినట్లు తెలిపారు. తొలి విడత పోటీలో గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 80 మంది ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆసియాలోనే అతి పెద్దదిగా భావించే బిజినెస్ ప్లాన్ కాంపిటీషన్‌లో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో మూకా వినయంపై శిక్షణ



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ పాఠ్యాంశాలలో భాగంగా సోమవారం మూకా వినయం (మైమ్) అన్న ప్రక్రియ మీద శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ శిబిరానికి అధ్యాపకులు డాక్టర్ మైమ్ మధు విద్యార్థులకు ఈ మూకాభినయం ప్రాముఖ్యత, మెలకువలు బోధించారు. విద్యార్థులకు సోమవారం జరిగిన నటన నృత్య అభినయాలలో మెరుగులు నేర్పించారు. విద్యార్థులు పూర్తి ఆనందంతో ఈ మూకాభినయాన్ని అభ్యసించారు. విశ్వవిద్యాలయ థియేటర్ ఆచార్య ఎల్వీ నాగభూషణరావు, నృత్యశాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం.కాశయ్య, పలువురు అధ్యాపకులు మూకాభినయ ఆవశ్యకతను తెలియజేశారు. మంగళవారం కొరియోగ్రఫీపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని కార్యక్రమ పర్యవేక్షకురాలు జి.లహరి తెలియజేశారు.

చేబ్రోలు ఎస్ఐగా వీరనారాయణ

చేబ్రోలు: చేబ్రోలు ఎస్ఐగా పి.వీరనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డి.వెంకట కృష్ణను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. నల్లపాడు ఎస్ఐగా పనిచేస్తున్న వీరనారాయణను చేబ్రోలు పోలీసు స్టేషన్ ఎస్ఐ-1గా బదిలీ చేయటంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐను పలువురు అభినందించారు.

రెండేళ్లుగా.. అసంపూర్తిగా..

- చివరి దశలో ఆగిన సచివాలయ నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

పొన్నూరు: మండలంలో పలు ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వాటికి రూ.లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టింది. ఎన్నికలు రావడంతో చివరి దశలో ఉన్న నిర్మాణాలు చిన్న చిన్న పనుల కారణంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలను పట్టించుకోకుండా విస్మరించింది. దీంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

మండలంలోని ములుకుదురు గ్రామంలో సుమారు రూ.30 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. విశాలమైన గదులు, అన్ని సౌకర్యాలతో చేపట్టిన నిర్మాణ పనులు వివిధ దశలలో నిలిచిపోయి కనిపిస్తున్నాయి. దీంతో ఈ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఫలితంగా పాత భవనంలోనే సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. తలుపులు కూడా లేని కారణంగా ఆకతాయిలు గదులలోని అద్దాలు పగులగొట్టిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



చివరి దశలో నిలిచిన సచివాలయ భవన నిర్మాణం



తలుపులు లేని గదులు



కిటికీల అద్దాలు పగులగొట్టిన దృశ్యం

త్వరలోనే పూర్తిచేస్తాం

ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ ధనేకుల మదన్‌మోహన్‌ను వివరణ కోరగా చివరి దశలో నిలిచిన సచివాలయ నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

చేబ్రోలు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. విత్తనాలు పెట్టిన తరువాత చిన్న మొక్క, మొలకదశలో భారీ వర్షాలు రైతులను క్రుంగదీశాయి. పొలాల్లోని నీరు బయటకు పోవటానికి సమయం పట్టడంతో మొక్కలు ఉరకెత్తటం, మొలక దెబ్బతినటంతో రైతులు నష్టపోయారు. దెబ్బతిన్న పంట పొలాలను బతికించుకోవటం కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి యూరియా పిచికారీ చేయాల్సిన పరిస్థితిలో రైతులకు కష్టాలు ఎక్కువయ్యాయి.

చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని శలపాడు, శేకూరు, వీరనాయకునిపాలెం, సుద్దపల్లి గ్రామాల్లో డ్రైయిన్లు పొంగి ప్రవహించటంతో పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిగిలిన గ్రామాల్లో పొలాల్లోని నీరు బయటకు పోవటానికి ఆలస్యం అవడంతో ముంపుబారిన పడ్డాయి. వర్షాలు పోయి పదిహేను రోజులు కావస్తున్నప్పటికీ పైర్లు ఇప్పటికీ కోలుకోలేదు. ప్రస్తుత దశలో పొలాలకు ఎరువులు తప్పనిసరిగా పిచికారీ చేయాల్సిన సమయం.

సొసైటీ, షాపుల వద్ద క్యూ కట్టిన రైతులు

మండల పరిధిలోని నారాకోడూరు జీడీసీఎంఎస్, వేజండ్ల సొసైటీల వద్ద సోమవారం యూరియా కట్టలు సరఫరా చేస్తున్నట్లు రైతులకు సమాచారం అందటంతో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో పనులు మానుకొని వచ్చి క్యూ కట్టారు. ఒక్కో రైతుకు ఒకటి, రెండు యూరియా బస్తాలు మాత్రమే అధికారులు అందజేశారు. ఎమ్మార్పీ ధరకు యూరియా అందుతుందని తెలిసి వాటిని పొందటానికి గంటల తరబడి క్యూలో నిలబడి కుస్తీ పడాల్సిన దుస్థితి నెలకొంది.



వేజండ్ల సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయశాఖాధికారిణి ప్రియదర్శిని తెలిపారు. వేజండ్ల సొసైటీ, నారాకోడూరు జీడీసీఎంఎస్‌ల ద్వారా 40 టన్నుల యూరియాను ఈ రోజు రైతులకు అందజేసినట్లు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాలకు యూరియా, డీఏపీలు అందుబాటులో ఉంటాయన్నారు. అవసరం మేరకు మాత్రమే ఎరువులను రైతులు తీసుకువెళ్లాలని అదనంగా తీసుకొని నిల్వ చేసుకోవద్దని ఏవో తెలిపారు.

ఆధారిత ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కావాలి

ప్రముఖ సాంకేతిక రంగ నిపుణులు పవన్ కుమార్ రాయవరపు

గుంటూరు రూరల్: భారతదేశాన్ని ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి ప్రముఖ సాంకేతిక రంగ నిపుణులు పవన్ కుమార్ రాయవరపు సూచించారు. త్వరలో ఐఐటీ బొంబాయిలో జరగనున్న యూరేకా 2025 నేషనల్ ఎంట్రప్రెన్యూర్షిప్ చాలెంజ్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి, కళాశాల ఈడీ సెల్, ఆర్‌వీఆర్ జేసీ, ఆర్‌వీఆర్‌జేసీసీఈఎస్‌టీపీ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ నూతన స్టార్టప్ ఆలోచనలను, వాటి ఆచరణాత్మక ప్రయోజనాలను, సమాజంపై ప్రభావాన్ని వివరించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన జట్లకు బహుమతులు అందజేశారు. సాంకేతికత, సృజనాత్మక ఆలోచనలు, స్టార్టప్‌లు దేశ అభివృద్ధికి నాంది పలికే మార్గమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. యువతకు స్వీయ ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి, దేశానికి నూతన వ్యాపారవేత్తలను అందించడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఐటీబీఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, ఆర్‌జేసీ నెస్ట్ సీఈవో డాక్టర్ హఫీజ్ బాషా, కళాశాల ఈడీ సెల్ కన్వీనర్ డాక్టర్ రాధికా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

అర్జీల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, ప్రతి సోమవారం అర్జీల పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ ద్వారా 33 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 2, పరిపాలన విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలి..

ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. సోమవారం నెహ్రూనగర్, ఆకులవారి తోట, అంకమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రజలు తమ ఇళ్లల్లోని వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసే ప్రజారోగ్య కార్మికులకు అందించాలన్నారు. కార్మికులు, కార్యదర్శులు ప్రజలకు వ్యర్థాల విభజన, హోం కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా నిర్మాణాలు చేసే వారు నిర్దేశిత నిబంధనలు పాటించాలని, ఆ విధంగా చేయని వారి నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలు వేసే వారిపై నిఘా పెట్టి, అటువంటి వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులకు తెలిపారు. పర్యటనలో డీఈఈ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు

గుంటూరు రూరల్: బీసీల రిజర్వేషన్ల సాధకుడు, అభివృద్ధికి కృషిచేసిన మహా నాయకుడు బీపీ మండల్ అని బీపీ మండల్ సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని చిల్లీస్ సెంటర్‌లో బీపీ మండల్ జయతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలా మాట్లాడుతూ మండల్ ఆశయ సాధన కోసం ప్రతి బీసీ కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయినా చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకపోవటం దుర్మార్గమన్నారు. దేశంలో 60 శాతం ఉన్న బీసీలకు చట్ట సభల్లో కేవలం 20 శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉందన్నారు. వెంటనే కులగణన చేసి జనాభా థామాషా ప్రకారం ఎస్సీల మాదిరిగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పీవీ రమణయ్య, సాధు సత్యనారాయణ, కోటేశ్వరరావు, ఉగ్గం సాంబశివరావు, కట్టెబోయిన నరసప్ప, మేకల సుబ్బారావు, బి.రమేష్, బి.కళ్యాణ్ తదితరులున్నారు.



నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుంటూరు రూరల్: ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానంతో సమానమని చలపతి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాంనందున్న కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చేయగలిగిన దానం రక్తదానమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాధ్యతగా రక్తదానం చేయాలన్నారు. మానవత్వంతో కూడిన సేవ చేయటం ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సృష్టిలో ఏదైనా సృష్టించవచ్చని, కానీ రక్తాన్ని సృష్టించలేమని తెలిపారు. బ్రహ్మకుమారీస్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు 65 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఎ.బాలాజీ, జె.భార్గవ్, డాక్టర్ కె.వెంకటరావు, డాక్టర్ పి.నరేంద్రకుమార్, గోపీరాజు, కె.అరుణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.తిరుపతినాయుడు, డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, డాక్టర్ ఆర్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చవితి వేడుకకు సిద్ధమైన గణనాథుడు

చవితి వేడుకలకు గణనాథుడు ముస్తాబవుతున్నాడు. రంగు రంగుల అలంకరణలు, రకరకాల ఆకారాల్లో విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ముచ్చటగొల్పుతున్నాయి. ఒక అడుగు విగ్రహం నుంచి 15 అడుగుల ఎత్తు విగ్రహాలు అందుబాటులో ఉంచారు. విగ్రహాల అమ్మకాల వద్ద విగ్రహ కమిటీలు, నిర్వాహకులు చేరుకుని వినాయకుని ప్రతిమలను ఎంపిక చేసుకుంటున్నారు. పందిళ్లకు చేరుతున్న వినాయకుని విగ్రహాలు, కమిటీ సభ్యులతో సందడి వాతావరణం చోటు చేసుకుంది.

- రేపు వినాయక చవితి పర్వదినం
- రంగురంగుల అలంకరణలో విఘ్నేశ్వరుని ప్రతిమలు
- 1 నుంచి 15 అడుగుల ఎత్తులో విగ్రహాలు
- విగ్రహాల కొనుగోళ్ల వద్ద కమిటీల సందడి

పెదకాకాని: ఆది దేవుడు, ప్రథమ పూజలందుకునే విఘ్నేశ్వరుడికి మనసారా పూజలు చేసేందుకు సర్వత్రా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని కమిటీలు, యూత్‌లు, ఉత్సవాల నిర్వాహకులు ఆయా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. వేడుకల నిర్వహణకు అవసరమైన నగదు చేతపట్టుకుని విగ్రహాలు ఎంపికలో నిమగ్నమయ్యారు. వినాయక చవితి వేడుకలకు వినాయకుని విగ్రహాలను అమ్మడంలో పెదకాకాని మండలానికి ఒక ప్రత్యేకత ఉంది.

పెదకాకాని వై.జంక్షన్‌లో 20 ఏళ్ల కిందట ప్రారంభించిన విగ్రహాల తయారీ నేటికీ కొనసాగుతుంది. రాజస్థాన్ నుంచి వచ్చిన వారు రకరకాల ఆకర్షణీయమైన రంగులు, అందమైన ఆకృతులలో వినాయకుని విగ్రహాలు తయారు చేసి అమ్మకాలు చేపట్టారు. వారితో పాటు పెదకాకాని వై.జంక్షన్‌లోని శ్రీవరలక్ష్మీ అమ్మవారి ఆలయం ప్రక్కన, కొప్పురావూరు అడ్డరోడ్డు, కంతేరు అడ్డరోడ్డు, గడ్డిపాడు సమీపంలోనూ వినాయకుడి విగ్రహాల అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక అడుగు ఎత్తు నుంచి 15 అడుగుల ఎత్తు వరకూ విగ్రహాలు తయారు చేశారు. ఒక్కొక్క విగ్రహం 500 రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకూ అమ్మకాలు చేస్తున్నారు.



పెదకాకాని వై జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా వినాయకుని విగ్రహాలు



విగ్రహాలను పందిళ్లకు తరలిస్తున్న కమిటీలు, నిర్వాహకులు

విగ్రహాలు కొనుగోలు సందడి

వినాయకుని విగ్రహాల కొనుగోలు చేసే ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. తయారు చేసిన విగ్రహాలను చూడటం, ఇష్టమైన ప్రతిమను ఎంపిక చేసుకోవడానికి వేర్వేరు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నిర్వాహకులు తరలి వస్తున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ట్రాక్టర్లతో చేరుకుని నచ్చిన విగ్రహాలను పందిళ్లకు తరలిస్తున్నారు. ముఖ్యంగా పెదకాకాని వై.జంక్షన్‌లో విగ్రహాల కోసం వచ్చిన ట్రాక్టర్‌లు, విగ్రహాలు ట్రాక్టర్‌లో పెట్టేందుకు సిద్ధంగా క్రేన్‌లు, కమిటీ కుర్రోళ్ల సందడి సందడి చేస్తున్నారు. ప్లాస్టరాఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు అమ్మకాలు చేపట్టిన తయారీదారులు ముడిసరుకు ధరలు బాగా పెరిగిపోయాయని, తక్కువ ధరకు అమ్మడానికి గిట్టుబాటు కావడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికే పలు ఆలయ కమిటీలు విగ్రహాలను పందిళ్లకు తరలిస్తున్నారు.

నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గంలోని 35వ డివిజన్ కృష్ణనగర్‌లో రూ.3.40 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డుల వారీగా ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. సదరు అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుని ప్రారంభించడం జరుగుతుందన్నారు. నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు పనులను నిర్దేశిత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పంట కాలువ పూడిపోయి ఎండిపోతున్న వరి పైర్లు

గుంటూరు రూరల్: రైతులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ ఊరుకుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో పంట పొలాలను, కాలువలను ఆయన పరిశీలించారు. గ్రామంలో సుమారు 500 ఎకరాలు వరిపైర్లు నీరు లేక ఎండిపోయే పరిస్థితికి వచ్చాయన్నారు. లాం ఆనకట్ట నుంచి పారుతున్న పంట కాలవలో జమ్మూ, తూటికాడ, రెల్లు పెరిగిపోయి నీరుపారుదల లేకపోవడం వల్ల సుమారు 500 ఎకరాలు వరి పైర్లు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఎకరాకు సుమారు రూ.15 వేల రూపాయలు వరకు రైతులు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు అధికారులకు, ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చి వారి చుట్టూ తిరిగినప్పటికీ ఇప్పటి వరకు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పంట కాలవను శుభ్రం చేసి నీరు పారుదలయ్యేటట్టు చేసి ఎండిపోతున్న వరి పైరులను కాపాడాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఇమ్మడి రామారావు, నీటి సంఘం అధ్యక్షులు ఇమడాబత్తుని వీరశేఖర్, మాజీ అధ్యక్షులు వంగా సాంబిరెడ్డి, రైతు నాయకులు జొన్నల కోటిరెడ్డి, కొల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

కార్పొరేషన్‌లో పీఎఫ్ గోల్‌మాల్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఈపీఎఫ్(ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్) స్కాం ఇటీవల బయటపడింది. ఈ వ్యవహారంలో కార్పొరేషన్‌కు భారీ స్థాయిలో ఆర్థిక నష్టం వాటిల్లిందని కార్యాలయ సిబ్బంది చెప్పుకుంటున్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయురాలి ఫిర్యాదుతో ఈ స్కాం వెలుగులోకి వచ్చింది. ఈపీఎఫ్ ఖతా నుంచి డబ్బులు డ్రా చేసుకున్నా దానిని సదరు వారి ఖాతాలో విత్‌డ్రా చేసుకున్నట్లు పోస్టింగ్ వేయకపోవడం కార్యాలయంలో గత కొద్ది సంవత్సరాలుగా ఈ స్కాం జరుగుతుంది.

ఉద్యోగినికి షోకాజ్ నోటీసు

నగరపాలక సంస్థ పరిధిలో 268 పర్మినెంట్ ఉద్యోగులు, 405 ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు ఉన్నాయి. వీరిలో ప్రస్తుతం ఉపాధ్యాయులను విద్యాశాఖకు(డీఈఓ) అటాచ్ చేయడంతో వారంతా ఇప్పుడు తమ పీఎఫ్ ఖాతాలను సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో రవీంద్ర నగర్‌లో మున్సిపల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న రామా దేవి 2021లో తన ఈపీఎఫ్ ఖాతా నుంచి రూ.8,21,000 విత్‌డ్రా చేసుకున్నారు. అయితే సదరు సొమ్ము పీఎఫ్ ఖాతాలో విత్ డ్రా చేసుకున్నట్లు పీఎఫ్ సెక్షన్‌లో పని చేసే రేణుకా దుర్గా భవానీ(ప్రస్తుతం ఆర్ఐగా పనిచేస్తున్నారు) పీఎఫ్ ఖాతాలో నమోదు చేయలేదు. సదరు టీచర్ లోన్ తీసుకున్నా లోన్ తీసుకోలేనట్లుగా పీఎఫ్ ఖాతాలో కనిపిస్తుంది. తన ఖాతాను సెటిల్‌మెంట్ చేసుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన సదరు టీచర్ విషయం తెలుసుకుని నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అదనపు కమిషనర్ దుర్గాభవానీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

తెలియకుండా చాలానే ఉన్నాయి?

ఉద్యోగులు అత్యవసర పరిస్థితుల్లో(ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం, వివాహాలు, ఇతర శుభ కార్యాలు చేసుకునేందుకు) పొదుపు చేసుకున్న ఈపీఎఫ్ ఖాతా నుంచి లోన్ తీసుకుంటుంటారు. అయితే ఇందులో నిబంధనల మేరకు కొంత అమౌంట్ ఖాతాలో ఉంచి మిగిలిన అమౌంట్ వారికి అందజేస్తుంటారు. అయితే ఈ క్రమంలో చాలా మంది కార్పొరేషన్ నుంచి ఈపీఎఫ్ లోన్లు తీసుకున్నా వారి లోన్స్ వివరాలు అప్‌డేట్ కావనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి గాను సంబంధిత లోన్ తీసుకునే ఉద్యోగుల నుంచి మామూళ్లు తీసుకుని వాటిని పోస్టింగ్ వేయకుండా ఉంటున్నారని చెబుతున్నారు. తద్వారా ఓ ఉద్యోగి ఎన్ని సార్లు లోన్ తీసుకున్నా అక్కడ లోన్ తీసుకోనట్లుగానే కనిపిస్తుంది. దీని వలన కార్పొరేషన్ భారీ స్థాయిలో ఆర్థిక నష్టం వాటిల్లిందనే చెప్పుకోవచ్చు. దీనిపై అధికారులు నిశితంగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేకపోలేదని కార్యాలయ సిబ్బంది గుసగుసలాడుతున్నారు.

ఈ స్కాం నుంచి కాపాడేందుకు ప్రయత్నాలు

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్ని స్కాంలు చేసినా తామకు కావాల్సిన వారైతే ఎటువంటి చర్యలు ఉండవు. లేదు అంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కార్యాలయ సిబ్బంది బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. పీఎఫ్ స్కాంలో సదరు మహిళ ఉద్యోగిని బయట పడేసేందుకు కమిషనర్ చాంబర్ అధికా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com